సత్యవేడువాసికి హైకోర్టు న్యాయమూర్తిగా అవకాశం


కుటుంబ సభ్యులతో చంద్రధనశేఖర్

సత్యవేడు, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తిగా సత్యవేడుకు చెందిన తూటా చంద్రధనశేఖర్‌ను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పని చేస్తున్నారు. న్యాయవాది చంద్రశేఖరన్, శైలజ దంపతుల కుమారుడు. 1 నుంచి 6వ తరగతి వరకు స్థానిక ముత్యాల్‌దాస్ ఎయిడెడ్ పాఠశాలలో, 7 నుంచి 10వ తరగతి వరకు సత్యవేడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. చెన్నైలోని ఎస్‌కేపీసీలో ఇంటర్, వివేకానంద కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. నెల్లూరులో లా చేశారు. 1999లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. సుమారు 23 ఏళ్లుగా హైకోర్టులోనే న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ న్యాయవాదిగా హైకోర్టులో సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సును కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదిస్తే ఆయన హైకోర్టు జడ్జిగా నియమితులవుతారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పట్టింది. మంగళవారం శ్రీవారిని 73,891 మంది దర్శించుకోగా రూ.3.53 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

వర్షం కారణంగా రెండు రైళ్ల రద్దు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో చెన్నై నుంచి కుప్పం మీదుగా బెంగళూరు, మైసూరు వెళ్లే రైళ్లను బుధవారం ఆ శాఖ అధికారులు రద్దు చేశారు. చెన్నై-బెంగళూరు మధ్య నడిచే లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లు.. రెండు ట్రిప్పులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అకస్మాత్తుగా రైళ్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ముసురుకున్న ఆందోళన

ఉద్యాన పంటలపై వర్ష ప్రభావం
కొనసాగితే టమాటా, పూల రైతులకు ఇబ్బందే

ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్, మిట్టూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం టమాటా, పూలు, బంగాళదుంప సాగు చేసిన రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. మూడు రోజులుగా ముసురు వెంటాడుతుండటంతో పంటకు తెగుళ్లు సోకుతాయని భయపడుతున్నారు. రెండు రోజులు వాతావరణం ఇలానే ఉంటే నిండా మునగడం ఖాయమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడమటి ప్రాంతాలైన కుప్పం, పలమనేరు, పుంగనూరులో ప్రధానంగా ఈ పరిస్థితి ఉంది. జిల్లాలో ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసింది. వర్షాభావం కారణంగా వేరుసెనగ విత్తిన రైతులంతా నష్టపోయారు. ఎకరాకు 4- 5 బస్తాలు కూడా దిగుబడి రాలేదు. సగటున ఎకరాకు రూ.6వేల- రూ.8వేల వరకు నష్టం వచ్చిందని రైతాంగం చెబుతోంది. పూలు, టమాటా, బంగాళదుంప పంటలైనా ఆదుకుంటాయని భావిస్తుండగానే అల్ప పీడనం ముంచుకొచ్చింది.

చెరువులకు 25 శాతం నీరు

జిల్లాలోని ఎన్టీఆర్ జలాశయం, కృష్ణాపురం ప్రాజెక్టుకు స్వల్పంగా నీరు వస్తోంది. నగరి, నింద్ర, విజయపురం మండలాల్లోని కొన్ని చెరువులకు 25-50శాతం నీరు చేరాయి. మిగిలినచోట్ల చెరువులకు నామమాత్రంగా చేరుతోంది. రానున్న రెండ్రోజుల్లో భారీగా వర్షం కురిస్తే తప్ప జలాశయాలు, చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశం లేదని అధికారులు పేర్కొన్నారు.


పుంగనూరు మండలం మల్లుపల్లిలో టమాటా తోటలో నిలిచిన వర్షపు నీరు

టమాటా సాగు	9,125 ఎకరాలు
పూల తోటలు	2వేల ఎకరాలు
బంగాళదుంప	300 ఎకరాలు

పశ్చిమ నియోజకవర్గాల్లో ప్రస్తుతం 9,125 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. దిగుబడులు తగ్గినందున ఇప్పుడు కిలో రూ.45- రూ.50 వరకు పలుకుతోంది. కొంతకాలం ఇలానే ఉంటే ఎంతోకొంత నష్టాలు పూడేవి. ముసురు, చిరు జల్లులతో పూత, పిందె రాలిపోతోంది. కాయలూ రంధ్రాలు పడుతున్నాయి. వర్షం తగ్గకుంటే టమాటా నాణ్యత తగ్గి ధరలు గణనీయంగా పడిపోనున్నాయి.

పెట్టుబడిలో సగం కూడా రాక

పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 2వేల ఎకరాల్లో పూల పంట ఉంది. ప్రస్తుతం కిలో ధర రూ.20-25గా ఉంది. దీంతో పెట్టుబడిలో సగం కూడా రాదని అన్నదాతలు వాపోతున్నారు. ముసురు ఇలానే ఉంటే పూలపై మచ్చలు ఏర్పడటంతోపాటు చెట్టు అంతా ఎరుపు రంగులోకి మారే ప్రమాదం ఉంది. అధికారుల లెక్కల ప్రకారం వంద ఎకరాల్లో బంగాళదుంప పండిస్తున్నారు. అనధికారికంగా మరో 200 ఎకరాల సాగుంది. చిరు జల్లులతో భూమిలోని గడ్డ కుళ్లిపోయి మూడు రోజుల్లోనే పంట మొత్తానికి నష్టం వాటిల్లుతుంది. కొంతసేపైనా ఎండ వస్తే బయటపడతామని రైతులు అంటున్నారు.


నగరి: ఒకటో వార్డు వీధిలో నీరు


పుత్తూరు: తడుకు సమీప గుళూరుకు వెళ్లే మార్గంలో రైల్వే వంతెన కింద వర్షపు నీరు


ముంపులో నగరిపేట


శిరుగురాజుపాళ్యంలో బంతి తోటలో కర్రలు నాటుతున్న రైతు సుధాకర్‌రెడ్డి


చౌడేపల్లె మండలం కోటూరు వద్ద వర్షానికి నెలకొరిగిన వరి


పుత్తూరు: మరాలిగేటు వద్ద రోడ్డుపై వర్షపు నీరు

నేడు పాఠశాలలకు సెలవు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో జిల్లాలో గురువారం భారీ వర్షం కురియనుందనే వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించామని డీఈవో దేవరాజు బుధవారం తెలిపారు. అన్ని యాజమాన్యాల పాఠశాలలు సెలవు ప్రకటించాల్సిందేనని స్పష్టం చేశారు. శుక్రవారం నుంచి పాఠశాలలు యథావిధిగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

నిలువునా మునిగిన రైతు

47 హెక్టార్లలో దెబ్బతిన్న వరి, వేరుసెనగ పంటలు

చిత్తూరు(వ్యవసాయం), మిట్టూరు, న్యూస్‌టుడే: అల్పపీడనంతో సంభవించిన తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేని వర్షం.. వరి రైతుకు అపార నష్టం మిగిల్చింది. ఎంతో శ్రమకోర్చి పండించిన పంట చేతికొచ్చే దశలో అన్నదాతల ఆశలు అడియాశలు చేసింది. సాగుకు పెట్టిన పెట్టుబడులు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. తుపాను కారణంగా జిల్లాలోని యాదమరి, ఐరాల, తవణంపల్లె, వెదురుకుప్పం, పెనుమూరు, చిత్తూరు, కార్వేటినగరం, రొంపిచెర్ల మండలాల్లో 22 గ్రామాల్లో 84 మంది రైతులు సాగు చేసిన 43 హెక్టార్లలో వరి పంట నేలకూలగా. . నాలుగు హెక్టార్లలో వేరుసెనగ దెబ్బతిందని జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా చేసింది. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

26 మండలాల్లో వర్షం

అల్పపీడన ప్రభావంతో బుధవారం 26 మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. నింద్ర 21.2 మి.మీటర్లు, సోమలలో 19.6, పెద్దపంజాణి, పెనుమూరు 15.4, వెదురుకుప్పం 14, చౌడేపల్లె 13.2, రొంపిచెర్ల 12.4, పూతలపట్టు, ఎస్ఆర్‌పురంలో 12.2, కార్వేటినగరం 12, పుంగనూరు 10.6 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.


రొంపిచెర్లలో నేలవాలిన వరిని చూపుతున్న బాధిత రైతులు

విద్యుత్తు తీగలతో అప్రమత్తత అవసరం


ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: 'వర్షాల సమయంలో విద్యుత్తు తీగలతో ప్రమాదం పొంచి ఉంటుంది. ఇళ్ల నుంచి ఆరుబయట ప్రాంతాల్లోనూ అప్రమత్తత ఎంతో అవసరం. వర్షాలకు స్తంభాలు, తీగలు వాలిపోవడం, కూలిపోవడం, ప్రమాదకరమని గుర్తించిన వెంటనే ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్తు శాఖ ఇంజినీర్లు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలి' అని అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లపై నుంచి విద్యుత్తు లైన్ వెళ్తుంటే వర్షాలు కురిసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు డాబాలపై ఆడుకునే సమయంలో ప్రమాదం పొంచి ఉంటుంది. ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే నేరుగా తాకరాదు. సరఫరా నిలిపేసి పొడి కర్రతో తీగలు తొలగించాలి. ఇంటి గోడల్లోకి నీటి చెమ్మదిగితే స్విచ్ బోర్డులు తడవకుండా చూసుకోవాలి. విద్యుత్తు మోటార్లు తాకరాదు. తడిసిన స్తంభాలు, సపోర్టు తీగలకు దూరంగా ఉండాలి. తెగిపడిన తీగలు, తీగలపై పడిన చెట్ల కొమ్మలను తాకరాదు అని అధికారులు సూచనలు చేస్తున్నారు. స్తంభాలు, తీగలు వాలినా, కిందపడినా, చెట్లు విరిగిపడినా తాకే ప్రయత్నం చేయొద్దని, తక్షణమే టోల్‌ఫ్రీ నంబరు లేదా విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బందికి సమాచారమిస్తే వెంటనే వచ్చి సరిచేస్తారని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

విద్యుత్తు అంతరాయానికి టోల్‌ఫ్రీ నంబరు: 1912

సహాయ కేంద్రాల నంబర్లు
- చిత్తూరు అర్బన్: 94408 17419
- చిత్తూరు రూరల్: 94910 52934
- పుంగనూరు: 80740 51992

జిల్లాలో మద్యం దుకాణాల ప్రారంభం



చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లాలో నోటిఫై చేసిన ప్రైవేటు మద్యం దుకాణాలు బుధవారం ప్రారంభమయ్యాయి. కొత్త బ్రాండ్లు, నాణ్యమైన మద్యం సీసాలతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బడి, గుడికి 100 మీటర్లలోపు, నివాసాల వద్ద దుకాణాలు ఉండరాదనే స్థానికుల అభ్యంతరాల కారణంగా ప్రారంభం కాకపోగా.. గురువారం అన్ని దుకాణాల్లో విక్రయాలు జరగనున్నాయి. దుకాణదారులకు వారం పది రోజుల్లో ఒరిజినల్ లైసెన్సులు అందనున్నాయి.

చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

చిత్తూరు(వైద్యవిభాగం): చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం వినికిడి లోపం ఉన్నవారికి డీఈఐసీ కేంద్రం, ఈఎన్‌టీ విభాగం ద్వారా ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి బుధవారం తెలిపారు. వైద్యులు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా పరికరాలు పంపిణీ చేస్తారని చెప్పారు. ఆధార్, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఆడియోగ్రామ్ రిపోర్టు తీసుకురావాలని ఆమె కోరారు.



ఇన్‌స్పైర్ పోటీలో తన ప్రాజెక్టుతో విద్యార్థిని

నూతన ఆవిష్కరణల వైపు అడుగులు

ఆచరణాత్మక పరిశోధనలకు శ్రీకారం ◆ రాష్ట్రంలోనే జిల్లా ప్రథమం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే:

విద్యార్థుల ఆలోచనలతో సమస్యల పరిష్కారం, సమాజానికి మేలు చేసేలా మదిలో మెదిలే వాటికి రూపం ఇవ్వడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సృజనాత్మకత వెలికితీసే ప్రయత్నాలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. కొత్త ఆవిష్కరణల దిశగా వారిని అడుగులు వేయిస్తోంది. వీటిని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ) పర్యవేక్షిస్తుంది.. పాఠశాల విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభా పాటవాలు గుర్తించి వారికి ఈ సంస్థలు పోటీలను నిర్వహిస్తున్నాయి.. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రాష్ట్రపతి కార్యాలయంలో బస చేయడంతో పాటు తాను పొందిన జ్ఞానాన్ని ఇతర మేధావులతో పంచుకునే అవకాశం కల్పిస్తోంది.

ఇన్‌స్పైర్ నామినేషన్ల వివరాలు

2019-20	5,276
2020-21	5,177
2021-22	6,288
2022-23	6,602
2023-24	5,720
2024-25	2,766

(జిల్లా పునర్విభజన తర్వాత)

సృజనాత్మకతకు పోటీ..

అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్ఐఎఫ్ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు ఇన్‌స్పైర్ ప్రదర్శన నిర్వహిస్తోంది. ఆయా పాఠశాలల పరిధిలో అంతర్గత పోటీలు నిర్వహించి సొంత ఆలోచనలతో తమ ప్రతిపాదనలను విద్యార్థులు తెలియజేస్తారు. అందులో రెండు, మూడు ప్రాజెక్టులు ఎంపిక చేసి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు ఇన్‌స్పైర్ పోర్టల్లో అప్‌లోడ్ చేస్తారు. పాఠశాలల వారీగా వచ్చిన నమూనాలు సేకరిస్తారు. ఇందులో దేశవ్యాప్తంగా 10లక్షల వరకు నమోదైన తర్వాత వాటిని ఎన్ఐఎఫ్ పరిశీలించి ఒక లక్ష వరకు ఎంపిక చేస్తారు. ఎంపికైన ఒక్కో విద్యార్థికి నమూనా తయారీకి రూ.10వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. తర్వాత జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ నిర్వహించి ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన వాటిని జాతీయ స్థాయికి, అక్కడ ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వాటిని ఎంపిక చేసి ఆసియా స్థాయి పోటీకి ఎంపిక చేస్తారు.

చక్కటి అవకాశం..


ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఇన్‌స్పైర్ మనక్ సరికొత్త ఆలోచనలకు రూపమిస్తుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు మంచి అవకాశం కల్పిస్తుంది. ఈ పోటీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విధిగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.


– దేవరాజు, డీఈవో చిత్తూరు


కొత్త ఆవిష్కరణలకు నాంది..

పిల్లల్లో సరికొత్త ఆలోచనల ఆవిష్కరణకు ఇన్‌స్పైర్ ప్రదర్శన బాగా ఉపయోగపడుతుంది. దేశానికి అవసరమైన శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు అవసరం. ఎంపికైన ప్రాజెక్టులను తయారు చేసుకుని ఏటా పోటీల్లో పాల్గొనేలా సహకారం అందించాలి. విద్యార్థుల్లో కొత్త ఆలోచనలతో ఆవిష్కరణ ఉండేలా ప్రాజెక్టుల రూపకల్పన బాధ్యత సైన్స్ ఉపాధ్యాయులపై ఉంది.

– ఆర్వీ రమణ, జిల్లా సైన్స్ అధికారి, చిత్తూరు







సార్వత్రిక ఎన్నికల అదనపు బడ్జెట్ విడుదల

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి జిల్లాకు రూ.19.18 కోట్లు అదనపు బడ్జెట్‌ను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల నిమిత్తం మొదటి దశలో కొంత నిధుల్ని మంజూరు చేసింది. ఇవి చాలకపోవడంతో అదనపు బడ్జెట్ కేటాయించాలని జిల్లా యంత్రాంగం ప్రతిపాదనల్ని పంపింది. దీంతో పెండింగ్ బిల్లుల చెల్లింపుల నిమిత్తం రెండో విడతగా అదనపు బడ్జెట్ విడుదల చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ఎండీ సురేష్ కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ క్రిష్ణారావు

వైద్య విద్యలో ప్రణాళికాబద్ధంగా సాగాలి

ఎంబీబీఎస్ తరగతుల ప్రారంభోత్సవంలో పీఈఎస్ ఎండీ

కుప్పం, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సొంతమవుతాయని పీఈఎస్ వైద్య కళాశాల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఎంబీబీఎస్ 23వ బ్యాచ్ మొదటి ఏడాది తరగతుల ప్రారంభోత్సవాన్ని కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ ప్రసంగిస్తూ.. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోర్సును విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. వైద్య విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపల్ హెచ్.ఆర్.కృష్ణారావు పేర్కొన్నారు. బెంగళూరులోని హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ అసోసియేట్ డీన్ డాక్టర్ విశాల్‌రావు, బెంగళూరు క్యాపిటస్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ బి.ఎస్.చంద్రశేఖర్ ప్రసంగించారు. 2023-24 విద్యాసంవత్సర పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పతకాలు, ప్రశంస పత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ రాఘవ సుబ్బారావు, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎన్‌కె సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జోరువానలోనూ తగ్గని భక్తిభావం



నడిచి వెళుతున్న భక్తులు

పెనుమూరు: సాధారణంగా వర్షం ప్రారంభమైతే ఎవరైనా వెంటనే తడవకుండా ఉండేదుకు ప్రయత్నించి చాటుకు వెళతారు. అలాంటిది జోరున వర్షం కురుస్తున్నా చలించక తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన పలువురు భక్తులు తిరుమలకు చిత్తూరు, పెనుమూరు మీదుగా పాదయాత్ర కొనసాగిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి జోరువానలోనే భక్తిభావంతో ముందుకు సాగుతున్నారు. స్వామిపై ఉన్న భక్తితో వెనకడుగు వేయలేదని తెలిపారు.

ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.50 వేలు డ్రా

పుత్తూరు: తిరుపతి జిల్లా నారాయణవనం మండలం గోవిందప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన మనోహర్ ఎస్బీఐ ప్రధాన బ్రాంచిలో ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వచ్చారు. ఏటీఎంలో కార్డు పెట్టి డ్రా చేసేందుకు ప్రయత్నించగా నగదు రాలేదు. దీంతో కార్డు ఏటీఎంలో పెట్టి తన వద్ద ఉన్న పాసుపుస్తకాన్ని పరిశీలిస్తుండగా వెనకే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి కార్డు మార్చి తీసుకెళ్లాడు. ఆపై వేరే ఏటీఎంకు వెళ్లి రూ.50 వేలు డ్రా చేసుకున్నట్లు బాధితుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	127
రిటైల్	149
లేయర్	120
బ్రాయిలర్స్	216
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	246
లేయర్ మాంసం	204

ఉద్యోగాల పేరుతో దగా..!

● నకిలీ నియామక పత్రాలిచ్చి రూ.లక్షల్లో వసూళ్లు ● కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నగదు ఇస్తే ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. మోసానికి పాల్పడిన ముఠా బాధితులు ప్రస్తుతం బయటకు వస్తున్నారు. అడిగినంత ఇస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఏకంగా ముంబయికి చెందిన ఓ ఫౌండేషన్ పేరుతో నియామక పత్రాలు సృష్టించారు. వాటితో పాఠశాలల్లో ఉద్యోగాల్లో కూడా చేరారు. చివరకు ఆ ఫౌండేషన్ నుంచి ఒక రూపాయి జీతం రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు న్యాయం కోసం విద్యా పోలీసు శాఖల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

సూత్రధారి కుప్పంవాసే

కుప్పం మండలం నడుమూరు ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి వైకాపా హయాంలో పాఠశాలల్లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. దీంతో ఆశపడిన నిరుద్యోగులు ఆయన అడిగినంత ఇచ్చుకున్నారు. ఆపై ఆ ఫౌండేషన్ పేరుతో ఇచ్చిన నియామకపత్రాలతో ఆయా పాఠశాలలకు ఉద్యోగాల్లోకి చేరేందుకు వెళ్లారు. అక్కడి అధికారులకు అధికారికంగా అనుమతులు లేకపోయినా.. డీఈఓ కార్యాలయం నుంచి ఖర్చు మాట్లాడుతున్నామని.. ఫౌండేషన్ తరపున చేర్చుకోవాలని సూచించారు. నెలల తరబడి పనిచేసినా ఆ సంస్థ నుంచి జీతాలు రాకపోవడంతో ఆరా తీయగా మోసపోయిన విషయం అర్థమై కుప్పంలో ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఏకంగా కలెక్టర్‌కు విన్నవించారు. అయినా.. తమకు న్యాయం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు విన్నవించినా.. ప్చ్

పాలసముద్రం మండలం ఎస్.ఆర్.ఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన సంధ్య ఓ బాధితురాలు. కుప్పం మండలం నడుమూరు ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కొలువు ఇప్పిస్తామని నమ్మించారు. ఆమె కుప్పంలోని మరిది ద్వారా ఆ ఉద్యోగి ఖాతాకు సుమారు రూ.2.60 లక్షల నగదు జమ చేశారు. దీంతో ఆదే గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్‌గా నియామక పత్రాన్ని అందించారు. అక్కడ చేరి రెండు నెలలు పనిచేసినా జీతం అందలేదు. అనుమానంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా.. అక్కడ న్యాయం జరగలేదు. ఇటీవల కుప్పంలో జరిగిన ప్రజాఫిర్యాదుల వేదికలో నేరుగా కలెక్టర్‌కు రెండు సార్లు వినతి అందించినా న్యాయం జరగలేదని బాధితురాలు వాపోయింది.



నకిలీ నియామక పత్రంతో పాలసముద్రం మండలం ఎస్ఆర్ఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన పావులూరు సంధ్య



నకిలీ నియామకపత్రంతో కుప్పం మండలం నూలుకుంటకు చెందిన శాంత మూర్తి

పిల్లల కోసం పాఠశాల వద్దకు వెళ్తే..

మా బాబు నడుమూరు ఆదర్శ పాఠశాలలో చదువుతున్నాడు. అతని కోసం అక్కడికి వెళ్లగా ఓ ఉద్యోగి పరిచయమయ్యాడు. మొదట రూ.5 వేలిస్తే ప్రభుత్వ ఉద్యోగం ఎక్కడ ఖాళీ ఉంటే తెలియజేస్తానని నమ్మించాడు. ఆ తర్వాత ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో ఫోన్‌పే ద్వారా రూ.లక్ష, మరో రూ.1.80 లక్షలు నగదు.. మొత్తం రూ.2.80 లక్షలు ఇచ్చాను. కుప్పం మండలం చందం జడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా నియమిస్తూ ప్రైవేటు సంస్థ పేరుతో నియామక పత్రాన్ని ఇచ్చారు. ఏడు నెలలు పనిచేసినా జీతం ఇవ్వలేదు. న్యాయం కోసం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కూడా ఫిర్యాదు చేశా. న్యాయం జరగలేదు.

\- శాంతమూర్తి, బాధితుడు

అలాంటి ఉద్యోగాలు ఇవ్వలేదు

గతంలోనే ఈ వ్యవహారాన్ని కొందరు మా దృష్టికి తీసుకొచ్చారు. విద్యాశాఖలో ఎప్పుడూ అలాంటి ఉద్యోగాలు ఇవ్వలేదు. వాటికీ మాకు ఎలాంటి సంబంధం లేదు.

\- దేవరాజు, డీఈఓ, చిత్తూరు



ఎంపికైన విద్యార్థులతో కేఈసీ వైస్ ఛైర్మన్ సునీల్‌రాజ్, జేఎన్‌టీయూ క్రీడా కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి

వర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జేఎన్‌టీయూ అనంతపురం జట్టు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. వర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి 75 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి పోటీలు పరీక్షలు నిర్వహించి 16 మందిని ఎంపిక చేసినట్లు జేఎన్‌టీయూ క్రీడా కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి తెలిపారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డేవిస్, శ్రీహరి విజుకుమార్ ఎంపికైనట్లు బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ నాగరాజ్ తెలిపారు.

జాగ్రత్తలతో పంటనష్టం దూరం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, ఈ నేపథ్యంలో పంటల్లో నష్ట నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త సంధ్యారాణి బుధవారం తెలిపారు. పిలక దశలో ఉన్న వరి పంటలో నీరు ఎక్కువగా నిల్వ ఉన్న పొలాల్లో త్వరగా పుంజుకోవడానికి ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలన్నారు. ఈ వాతావరణానికి ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం లేదా 2 గ్రాముల కార్బండిజం, మాంకోజెట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. రబీ వరి నారుమళ్లలో నీరు నిలిచి ఉంటే త్వరగా పెరగడానికి నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ పైపాటుగా వేయాలన్నారు. కంది పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తీయాలని, వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా వేయడం వల్ల పంట ఎదుగుదల పుంజుకుని నష్టాన్ని తగ్గించవచ్చని రైతులకు ఆమె సూచించారు.

పీఎంశ్రీ పాఠశాలల్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 40 పాఠశాలల్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో సివిల్ పనులతో పాటు ఆటస్థలాలు, ప్రయోగశాలల్ని అభివృద్ధి చేయాలన్నారు. ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి తీసుకురావాలని, దీనికోసం పాఠశాల నిర్వహణ నిధుల్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధి నిధులతో పాఠశాలల ప్రహరీల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తుపాను కారణంగా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి డీపీవో పార్వతి ఆదేశించారు. ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కాలువల్లో పూడిక, వీధుల్లో చెత్త వెంటనే తొలగించాలన్నారు. క్రిమికీటకాల వ్యాప్తి అరికట్టేందుకు బ్లీచింగ్ చేయాలని, మురుగు వ్యర్థాలు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకుల్ని శుభ్రం చేసి అక్కడ సదరు తేదీలు రాయాలన్నారు. రాత్రి వేళ ఫాగింగ్ చేయాలని, మురుగునీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉండి అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించాలని ఆమె ఆదేశించారు.

లిక్విడేటర్ బాధ్యతలు ఏడాది పొడిగింపు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: విజయా సహకార డెయిరీ లిక్విడేటర్ బాధ్యతల్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు డివిజనల్ సహకార అధికారి వనజ ప్రస్తుతం డెయిరీ లిక్విడేటర్‌గా కొనసాగుతున్నారు.

భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం

ముక్కంటి ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ స్పష్టం చేశారు. ఆలయంలోని పరిపాలన భవనం సమావేశపు హాలులో బుధవారం ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య సమక్షంలో ముఖ్య అధికారులతో పాటు భద్రతా విభాగం ముఖ్యులతో సమావేశం అయ్యారు. ఆలయంలోకి ప్రవేశించే నాలుగు గోపురాల్లో ప్రస్తుతం ఉన్న భద్రత సరిపోదని, దాన్ని మరింత పకడ్బందీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుమల తరహాలో మహాద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించి పంపేలా భద్రత వ్యవస్థను పటిష్ఠపరచాలన్నారు. కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో మండపాలను, రోడ్డు నిర్మాణం, దీపాల ఏర్పాటును కైలాసగిరి ప్రదక్షిణ ఉత్సవం నిర్వహించేలోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ శాఖకు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈవో లోకేష్‌రెడ్డి, సీఎస్‌వో నాగభూషణం, ఆలయ తనిఖీ అధికారులు హరియాదవ్, సుదర్శనం, ఎస్పీఎఫ్, రెవెన్యూ, పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్టోపస్ దళం అధికారులతో సమావేశమైన ఈవో చంద్రశేఖర్ ఆజాద్

నేడు వాల్మీకి మహర్షి జయంతి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా గురువారం వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీబాషా బుధవారం తెలిపారు. కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.



అడిగేదెవరని.. మూలన పడేశారు..!

చిత్తూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం చుట్టుపక్కల నుంచే కాక నగరంలోని అనేక మంది ప్రజలు ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. వీరికి ఆసుపత్రిలో ఉండే హక్కులు తెలియజేస్తూ బోర్డు ఏర్పాటు చేయాలి. దీన్ని అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలి. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం బోర్డు ఉన్నా అది ఎవరికీ కనిపించకుండా మూలన పడేశారు. ఫలితంగా రోగులు, వారి సహాయకులు తమకు ఎలాంటి వైద్యం అందుతుందో తెలుసుకోలేక పోతున్నారు.

-ఈనాడు, చిత్తూరు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతి మరొకరిని వివాహం చేసుకోవడంతో మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణంలోని పాతపేట గాంధీ వీధిలో బుధవారం రాత్రి వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మన్సూర్ బాషా కుమారుడు చాంద్ బాషా (23) డిగ్రీ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటున్నారు. ఓ యువతిని ప్రేమించగా.. ఆమెకు మరొకరితో వివాహమైంది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందారు. ఈ విషయం పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో సైనికుడి మృతి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సైనికుడు ఎస్.అల్తాఫ్ (47) అనారోగ్యంతో లద్దాఖ్‌లో మృతిచెందారు. ఆయన ఆర్మీలో సుబేదార్‌గా పనిచేస్తున్నారు. 28 ఏళ్ల కిందట సైన్యంలో చేరిన ఆయన 15 రోజుల క్రితం అనారోగ్యానికి గురైనట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. దిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కెప్టెన్ రాథోడ్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.



మృతదేహానికి గౌరవ వందనం చేస్తున్న కెప్టెన్ రాథోడ్

మద్యం దుకాణాలు వద్దంటూ మహిళల ధర్నా

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలోని గిరింపేట, డీఐరోడ్డులో మద్యం దుకాణాలు వద్దంటూ మహిళలు బుధవారం రోడ్డుపై బైఠాయించి మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరింపేట రహదారి పక్కన ఏర్పాటు చేస్తున్న దుకాణాన్ని అడ్డుకున్నారు. తెదేపా నాయకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ ఎక్సైజ్ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలను నిర్వహించాలని తెలిపారు. మద్యం వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే బడి, గుడి ఉందని గుర్తు చేశారు. దుకాణం మీదుగానే భక్తులు, విద్యార్థి, విద్యార్థినులు వెళ్లే పరిస్థితి ఉందని, స్థానికంగా దుకాణాన్ని ఏర్పాటు చేయకూడదని భీష్మించారు. దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ఊరుకోబోమని, తొలగించే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పోలీసుల జోక్యంతో సమస్య సద్దుమణిగింది. డీఐరోడ్డులో నేతాజీ కాలనీకి చెందిన మహిళలు రోడ్డెక్కారు. నివాసాల సమీపాన మద్యం దుకాణం వద్దని, తొలగించాలని డిమాండ్ చేశారు. వాహనాల రాకపోకలు నిలవడంతో చిత్తూరు ఒకటో పట్టణ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వచ్చి మహిళలతో మాట్లాడారు. దుకాణాన్ని మార్పిస్తామని చెప్పడంతో మహిళలు నిరసన విరమించారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

అండర్-17 ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపిక

యాదమరి, న్యూస్‌టుడే: యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-17 ఫెన్సింగ్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపికకు బుధవారం పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వసంతవాణి తెలిపారు. స్థానిక వ్యాయామ సంచాలకులు రవి, ప్రధానోపాధ్యాయుడు గిరిరాజా, పీడీలు సెల్వపాండియన్, కృష్ణయ్య, సిరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.



పోటీలు తిలకిస్తున్న జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వసంతవాణి

స్నేహ బంధం.. మృత్యుగండం

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

అమెరికాలో రోడ్డు ప్రమాదంతో తిరుపతి జిల్లాలో విషాదం

విదేశాల్లో వృత్తిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా.. అందరూ మంచి స్నేహితులు. పండుగలైనా.. పుట్టినరోజులైనా అందరూ కలసి ఆనందంగా చేసుకునే వాళ్లు. వాళ్ల నివాస ప్రాంతాల్లో బంధువర్గం బాగున్నా.. వృత్తి రీత్యా వీళ్లుంటున్న అమెరికాలో వీళ్లకు వీళ్లే ఆత్మబంధువులు. అందుకే కాస్తంత సెలవు దొరికినా ఆనందంగా గడుపుతుంటారు. వీరి స్నేహంపై విధికి కన్నుకుట్టింది. రోడ్డు ప్రమాద ఘటనలో కారులో ఏర్పడ్డ మంటల్లో చిక్కుకుని ముగ్గురు దుర్మరణం చెందగా.. మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. మూడు రోజుల పాటు వరుస సెలవులు రావడంతో అమెరికాలో ఉంటున్న వీళ్లందరూ సరదాగా గడిపేందుకు చుట్టు పక్కల ప్రాంతాల వీక్షణకు వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో దక్షిణ బాన్‌హామ్‌కు సమీపంలో అమెరికా కాలమానం ప్రకారం సోమవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ హృదయ విదారక ఘటనపై మృతుల కుటుంబీకులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరి వెనుక ఎన్నో ఆశలు.. ఆకాంక్షలు ఉన్నాయని. అవన్నీ పూర్తి చేయకనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం మరింత విషాదంగా మారింది.

దూరమైన ఆప్యాయత..



హరిత తల్లిని ఓదార్చుతున్న బంధువులు

తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, లతల పెద్ద కుమార్తె హరిత. కష్టపడి చదువుకుంది. తల్లిదండ్రులంటే ప్రేమ. ఈమెకు 2022 ఫిబ్రవరి 11న కేవీబీపురం మండలం ఆదరం గ్రామానికి చెందిన సాయి చెన్నుతో వివాహమైంది. ఇద్దరివీ మధ్య తరగతి కుటుంబాలే. వృత్తిరీత్యా అమెరికాలో ఉంటున్నారు. ఎనిమిది నెలల క్రితం సోదరి వివాహం సందర్భంగా ఇక్కడకు వచ్చి వెళ్లారు. హరిత, సాయి చెన్నుల ఆప్యాయతను తలుచుకుంటూ కుటుంబీకులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. సాయి ప్రాణాలతో బయటపడాలని ఇరు కుటుంబీకులు భగవంతుని ప్రార్థిస్తున్నారు.



భర్త సాయి చెన్నుతో హరిత (పాత చిత్రం)

తమ్ముడి కోసం పెళ్లి వాయిదా..



అల్లారుముద్దుగా పెంచుకున్న శునకంతో శివ

తొట్టంబేడు మండలం చిన్నకనపర్తికి చెందిన రాజినేని శివది మధ్య తరగతి కుటుంబం. తల్లిదండ్రులైన రమేష్‌నాయుడు, సుజాతల పెద్దకుమారుడు శివ. తొమ్మిదేళ్లుగా అమెరికాలోనే ఉంటున్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. తమ్ముడు లోకేశ్‌ను డాక్టర్ చేయాలన్న సంకల్పంతో ఎంతో శ్రమించి చదివించారు. తమ్ముని చదువు కోసం విశాఖపట్నంలో కుటుంబం ఉంటోంది. ఇటీవల పెళ్లి సంబంధాలు వచ్చినా తమ్ముడు డాక్టర్ అయ్యాక చేసుకుంటానంటూ సున్నితంగా చెప్పారు. ఎంతో ఇష్టపడి తెచ్చుకున్న శునకాన్ని అల్లారుముద్దుగా పెంచుకునేవారు.

ఆశలన్నీ ఆవిరాయే

ఓజిలి మండలం రాజుపాళెంకు చెందిన తిరుమూరు గోపి తండ్రి హైవే పక్కన హోటల్ నిర్వహిస్తున్నారు. ఎంతో కష్టపడి కుమారుడ్ని చదివించారు. తల్లిదండ్రుల శ్రమను కళ్లారా చూసిన గోపి కష్టపడి చదువుకుని అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా ఉంటున్నారు. రెండేళ్ల క్రితం గోపికి వివాహమైంది. భార్య అమెరికాలో ఉంటూ వచ్చింది. ఆర్నెళ్ల కిందట ఆమె భారత్‌కు వచ్చారు. ఇంతలో ఈ ఘటన జరగడంతో భార్య కుటుంబీకులతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ప్రమాదంలో మృతి చెందిన వారిని తీసుకువచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తానా సభ్యులతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయి రెడ్డికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అక్కడి వారిని కోరారు.



తానా అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ఎంపీ మిథున్‌రెడ్డి కేసులో మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాజంపేట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని పుంగనూరు వెళ్లకుండా నియంత్రిస్తూ ఏమైన ఉత్తర్వులు ఇచ్చి ఉంటే వాటిని తమ ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. పిటిషనర్ అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం విషయమై వినతి ఇచ్చేందుకు వెళ్లిన తమపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారని ఏఎస్ఆర్‌కే ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పుంగనూరు పోలీసులు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వాటిలో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి వేసిన పిటిషన్లపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల తరఫున అదనపు పీపీ మర్రి వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. పుంగనూరు వెళితే శాంతిభద్రతలకు విఘాతం అని పోలీసులు చెప్పినా పిటిషనర్ పెడచెవిన పెట్టారన్నారు. ఎంపీ అనుచరులే రాళ్లు, కర్రలతో ఫిర్యాదుదారులు, ప్రత్యర్థులపై దాడి చేశారన్నారు.

సీజనల్ వ్యాపారి ఐపీ దాఖలు

సదుం, న్యూస్‌టుడే: సదుం మండల కేంద్రంలోని వీఆర్ఆర్ కాలనీకి చెందిన బోయకొండ అనే వ్యక్తి పీలేరు కోర్టులో ఇటీవల రూ.30 లక్షలకు ఐపీ దాఖలు చేశారు. ఈయన వెంట్రుకలు, సీజనల్ వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. సెల్, సప్లయర్స్ దుకాణాలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం ప్రచురితమైంది. పాఠకులు గమనించగలరు.

అగ్నిప్రమాదం కేసులో వైకాపా ఎంపీపీ అరెస్టు

మరో నలుగురు నాయకులకు రిమాండ్

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరులో ఈ ఏడాది ఏప్రిల్ ఐదో తేదీన గిరింపేటలోని విద్యుత్తుశాఖ గోదాంలో జరిగిన అగ్నిప్రమాదానికి కారణమైన యాదమరి వైకాపా ఎంపీపీ సురేష్‌బాబు, మరో నలుగురు వైకాపా నాయకులను చిత్తూరు రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారిని మంగళవారం అర్ధరాత్రి దాటాక రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు నియోజకవర్గ వైకాపా అభ్యర్థి విజయానందరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ ఐదో తేదీ సాయంత్రం నాయకులతో కలిసి గిరింపేట మీదుగా గాయత్రీనగర్ వెళ్లారు. ఆ సమయంలో అతడి అభిమానులు గోదాం పక్కన పెద్దఎత్తున బాణసంచా పేల్చడంతో నిప్పురవ్వలు పడి అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు, పోలీసులు ఆలస్యంగా గుర్తించారు. ఈ ప్రమాదంలో సర్వీస్ వైర్లు, రెండు వేల బోర్డులు దగ్ధమయ్యాయని, వాటి విలువ రూ.14.98 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. విద్యుత్తు శాఖ డీఈఈ జయప్రకాష్ ఫిర్యాదుతో చిత్తూరు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదమరి ఎంపీపీ సురేష్‌బాబుతో పాటు మరో నలుగురిని గుర్తించారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక చిత్తూరు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తన బృందంతో కలిసి ఎంపీపీ సురేష్‌బాబు, శివకుమార్, కె.రమేష్ అలియాస్ చిలక, మురళి, చిన్నాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి



వరద బాధితులకు విరాళం

పుత్తూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడికి స్టార్క్ కంటైనర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇచ్చిన రూ.లక్ష చెక్కును తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు బుధవారం అందజేశారు. గుడిపాల మండలంలో ఉన్న ఈ కంపెనీ అందజేసిన చెక్కును మంత్రికి తాను అందజేశానని ఆయన పేర్కొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడికి చెక్కు అందజేస్తున్న విజయ్‌బాబు

సూక్ష్మసాగు నీటి పథకం పరిశీలన.. బంగారుపాళ్యం: నల్లగాంపల్లెలో సూక్ష్మసాగునీటి పథకాన్ని బుధవారం జేసీ విద్యాధరి పరిశీలించారు. డ్రిప్ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మండల ఉద్యానశాఖ అధికారిణి సాగరిక, తహసీల్దారు బాబురాజేంద్రప్రసాద్, ఏఈవో సూరయ్య, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: స్థానిక దుర్గానగర్ కాలనీలో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా లేదు. **-స్థానికులు**

సమాధానం: నీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు చేపడతాం. **-వెంకటరామిరెడ్డి, ఎంఈ, నగరపాలక సంస్థ**

న్యూస్‌టుడే, తవణంపల్లె

సమస్య: పుణ్యసముద్రం గ్రామంలోని కొన్ని మురుగు నీటి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి, గడ్డి పెరిగిపోయి పూడిపోతున్నాయి. దోమలు ప్రబలి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదముంది. **-స్థానికులు**

సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి మురుగునీటి కాలువలు శుభ్రం చేయించి పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం. **-రెడ్డిబాబు, ఎంపీడీవో, తవణంపల్లె**



ఉప కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర

కార్యాలయం ఉరుస్తుంటే విధులు ఎలా..?

ఎస్‌ఈకి విన్నవించిన అధికారులు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ ఈఆర్వో(ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం) భవనం పూర్తిగా ఉరుస్తోంది.. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి.. భయాందోళనల నడుమ ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నామని ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ దృష్టికి.. ఈఆర్వో అధికారులు, సిబ్బంది తీసుకెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఈ బుధవారం స్థానిక గాంధీరోడ్డులోని చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి.. కార్యాలయం మొత్తం ఉరుస్తుండటం, వర్షపు నీరు నిలిచి పైకప్పు కూలిపోయే స్థితిలో ఉందని, విధి నిర్వహణలో అవస్థలు పడుతున్నామని అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ చెప్పారు.

బాధ్యతాయుతంగా విధులు..

అర్బన్ కార్యాలయంలో ఇంజినీర్లు, అధికారులతో ఎస్‌ఈ సమీక్షించారు. అందరూ బాధ్యతగా పనిచేసి వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని చెప్పారు. తుపాను విషయంలో అప్రమత్తంగా ఉండి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలోని ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈఈ మునిచంద్ర, డీఈఈలు శేషాద్రిరెడ్డి, ప్రసాద్, ఆనంద్, ఏఈలు రాజా, వివేకానందరెడ్డి అధికారులు పాల్గొన్నారు.



ఏపీడీగా సునీల్‌కుమార్.. నిండ్ర: ఉపాధిహామీ నగరి క్లస్టర్ ఏపీడీగా సునీల్‌కుమార్ సీఎల్ఆర్సీ శిక్షణ భవనంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు డ్వామా కార్యాలయం నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు.

డివిజన్లు: 50 జనాభా: 2.2 లక్షలు వీధులు: 400 వీధి దీపాలు: 15 వేలు విద్యుత్తు విభాగం సిబ్బంది: ముగ్గురు

గాలికొదిలేశారు..

- పగలు వెలుగులు.. రాత్రి అంధకారం
- కొరవడిన నిర్వహణ
- చీకట్లో నగర వీధులు



ఓబనపల్లెలో పగటిపూట వెలుగుతున్న వీధిదీపం

చిత్తూరు నగరంలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. రాత్రి వేళల్లో అంధకారం..పగటి పూట విద్యుత్తు వెలుగుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయమైన రహదారులు..అందులోనూ చిమ్మచీకటి తోడవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకట్లో వీధుల్లో వెళ్లాలంటేనే జనం వెనుకంజ వేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. చాలా వరకు మరమ్మతుకు గురవడంతో..చోదకులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

● నగరపాలక సంస్థ పరిధిలో 10 ఏళ్ల కిందట ఈఈఎస్ఎల్ కంపెనీ ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేసి నిర్వహణను కొనసాగించింది. వీధిదీపాలతో పాటు వాటి పరికరాలు సమకూర్చింది. ప్రధాన కూడళ్లు, అంతర్గత వీధుల్లో వివిధ రకాల వోల్టులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆటో ఆఫ్, ఆన్ విధానం ద్వారా నిర్వహణ ఉండేది. ఎక్కడైనా మరమ్మతుకు గురైతే.. సాంకేతిక విధానం ద్వారా తక్షణం సమాచారం అందుకుని 48 గంటల వ్యవధిలో కొత్తవి ఏర్పాటు చేసేవారు. అయితే గతేడాది ఆగస్టు నుంచి ఈఈఎస్ఎల్ సంస్థ నిర్వహణ కాంట్రాక్టు ముగిసింది. దీంతో నిర్వహణను నగరపాలక సంస్థ చేపట్టింది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇవి పగటి పూట వెలగడం.. రాత్రి వేళల్లో పనిచేయకపోవడం తదితర కారణాలతో వీధులు అంధకారంగా తయారయ్యాయి. దీంతో ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు ఆరిపోతాయో తెలియని పరిస్థితి. మరమ్మతుకు గురైన వాటిని సకాలంలో సరిచేయక పోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. వీటిపై వార్డు సచివాలయ కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా.. స్పందించడం లేదని ఆయా కాలనీల వాసులు చెబుతున్నారు. పుర వీధుల్లో చిమ్మచీకటిగా ఉండటంతో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వారానికోసారైనా ఆయా కాలనీలను సందర్శించి వీటి నిర్వహణపై పర్యవేక్షణ చేసిన దాఖలాల్లేవు. నగరపాలక సంస్థకు ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లిస్తున్న తమకు ఇలాంటి పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



గిరింపేట బాలాజీకాలనీలో రాత్రి అంధకారం

విలీన పంచాయతీల్లో దేవుడెరుగు..

నగరపాలక సంస్థలో విలీనమైన 14 పంచాయతీల్లో వీధిదీపాల నిర్వహణ గాలికొదిలేశారు. పల్లె ప్రాంతాలు కావడంతో.. అంధకారంలో ప్రజలు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక గ్రామీణ ప్రజలు మిన్నకుండిపోతున్నారు. రాత్రి వేళ విషపురుగుల బెడద ఎక్కువగా ఉంటోందని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నగర శివారు ప్రాంతాలైన ఇందిరమ్మ కాలనీల్లో వందలాది వీధుల్లో అసలు దీపాలే లేవు. మౌలిక సదుపాయాల కొరత ఉన్న ఈ ప్రాంతాల్లో వెలుతురైనా తమకు ఉండటం లేదని వారు పేర్కొన్నారు. ఎల్ఈడీ దీపాలు కావడం.. నిర్వహణ బాధ్యతలు అలవాటు లేకపోవడంతో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. వీటి నెలవారీ విద్యుత్తు బిల్లు రూ.16లక్షలు విద్యుత్తుశాఖకు నగరపాలక సంస్థ చెల్లిస్తోంది.

మరమ్మతులు చేయిస్తాం..

నగరంలో వీధిదీపాల మరమ్మతుపై ఫిర్యాదులు అందితే తక్షణం స్పందిస్తున్నాం. ఆయా ప్రాంతాలకు వెళ్లి దీపాలకు మరమ్మతులు చేపడుతున్నాం. **-వెంకటరామిరెడ్డి, ఎంఈ, నగరపాలక సంస్థ**



మహిళలకు అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

ప్రభుత్వాసుపత్రిలో ఆహార దినోత్సవం

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలోని ప్రసూతి విభాగంలో బుధవారం అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎస్ఎన్ఏ విద్యార్థులు ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహార పదార్థాలు ప్రదర్శనగా ఉంచి.. బాలింతలు, గర్భిణులు, తల్లులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. చిత్తూరు అపోలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రంగనాథ్, అధికారులు రామ్‌గోపాల్, మంజులత, శేషసాయి, సరళ, శోభారాణి, చిత్ర, రాణి పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ నిరసన



సీఐకు వినతి అందజేస్తున్న గ్రామస్థులు

కార్వేటినగరం: కొల్లాగుంట ఏఏడబ్ల్యూలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ గ్రామస్థులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో దుకాణాన్ని ఏర్పాటు చేయడం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, దూరంగా ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్వేటినగరంలో పాఠశాలకు కూతవేటు దూరంలో దుకాణాన్ని ఏర్పాటు చేయడంతో మద్యం తాగేవారు పాఠశాల పరిసరాల్లో మద్యం తాగుతూ అల్లర్లు చేసే అవకాశముందన్నారు. ఎస్సై రాజ్‌కుమార్ సర్దిచెప్పడంతో వారు నిరసన విరమించి వెనుదిరిగారు. ఎక్సైజ్ సీఐ శిరీషాదేవిని వివరణ కోరగా ఆయా దుకాణాలు నిబంధనల మేరకే ఉన్నాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



క్రీడాకారులతో మాజీ మంత్రి రోజా

బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందన

నగరి, న్యూస్‌టుడే: రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులను నగరిలో మాజీ మంత్రి ఆర్.కె.రోజా బుధవారం అభినందించారు. స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు సాధించిన పట్టణానికి చెందిన కె.సి.తేజేష్, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి బెస్ట్ ఆఫ్ అప్‌కమింగ్ ప్లేయర్ అవార్డు పొందిన లక్ష్మీనరసింహారెడ్డి, భానుప్రకాష్, ఇజాజ్, రిత్విక్, సిద్ధిక్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. నాలుగేళ్ల క్రితం రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రీడాకారులకయ్యే అన్ని ఖర్చులు భరించి వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపి ప్రోత్సహించారని, ఆమెకు క్రీడాకారుల తల్లిదండ్రులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ● దేశూరు అగరంలో అయ్యప్ప దేవాలయ నూతన అష్టబంధన విగ్రహ ప్రతిష్ఠా మహాకుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా పాల్గొని పూజలు చేశారు.

అవినీతికి పాల్పడకుండా విధులు చేపట్టండి: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాలసముద్రం, న్యూస్‌టుడే: రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు అధికారులు అవినీతికి పాల్పడకుండా ప్రజలకు మేలు చేసే పనులు ధైర్యంగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఆరోగ్య కేంద్రాల్లో ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఆపై అధికారులతో సమీక్షించారు. జిల్లా కేంద్రానికి ఈ మండలం 43 కిమీ దూరంలో ఉందని, ప్రజల సమస్యలు ఇక్కడే పరిష్కరించి వారు చిత్తూరు వరకు రాకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సరిహద్దుల్లో సీసీ కెమెరాలు పెట్టుకోవాలని, ఉన్నవి సక్రమంగా పనిచేసేలా చూడాలని పోలీసులకు సూచించారు. పాలసముద్రం-చిత్తూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, త్వరలో నిధులు మంజూరైతే మొదటి ప్రాధాన్యంగా దీన్ని నిర్మిస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల మరమ్మతులు చేయిస్తామన్నారు. పీహెచ్‌సీలో వైద్యుల హాజరు పట్టిక, సిబ్బంది తీరు తనిఖీ చేసి గర్భిణులకు స్కానింగ్ కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో విద్యావతి, ఎస్సై భారతి, వైద్యాధికారిణి మోహన్‌క్రిష్ణ, డీటీ నాగరాజు, సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.



పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మురళీమోహన్

గ్రామాల అభివృద్ధే సీఎం ధ్యేయం

బంగారుపాళ్యం: గ్రామాల అభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం నల్లగాంపల్లెలో రూ.30 లక్షల విలువ చేసే తారురోడ్డు పనులను ప్రారంభించారు. అంతకుముందు, తుంబకుప్పం, సదకుప్పం, కొత్త వెంకటాపురం గ్రామాల్లో రూ.22లక్షల విలువ చేసే సిమెంట్ పనులకు భూమి పూజ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి స్థానికులు వినతులు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, మాజీ అధ్యక్షులు సురేంద్రనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జయచంద్రనాయుడు, క్లస్టర్ అధ్యక్షులు ధరణినాయుడు, లోకనాథ నాయుడు, రమేష్, గిరిబాబు, నల్లగాంపల్లె సర్పంచి శీబా, తుంబకుప్పం సర్పంచి లీలావతి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రసన్నకుమారి, మండల కార్యదర్శి జనార్దన్, కోదండయాదవ్, ఎంపీడీవో శ్రీధర్, నాయకులు కమల్‌నాథరెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.



నీవా నదిలో పూడిక తీస్తున్న యంత్రం

లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో చిత్తూరు నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యల్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ సంబంధిత శాఖల అధికారుల్ని ఆదేశించారు. నీవా నది పరివాహక ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల్లోకి నీరు రాకుండా బుధవారం పొక్లెయినర్లతో పూడికతీత పనుల్ని చేపట్టారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. **చిత్తూరు నగరం:** నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నరసింహప్రసాద్ సూచించారు. నీవా నది పరివాహక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. సమస్యలు తలెత్తితే ప్రజలు నగరపాలక సహాయ కేంద్రానికి ఫోన్ చేయాలని కోరారు. ఆరోగ్యాధికారి అనిల్‌కుమార్, ఏఈఈలు, పారిశుద్ధ్య విభాగంఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు వేయాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: గత 15ఏళ్లుగా పాలకులు మారుతున్నా ఎగువాగుళూరు దళితవాడ సిమెంటు రోడ్డుకు నోచుకోవడం లేదని ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామం వద్ద బుధవారం ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మునికృష్ణ, అంబేడ్కర్ సంఘం మండల కార్యదర్శి పుష్పరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించండి

యాదమరి: తుపాను సమయంలో పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. యాదమరి సమీపంలో నేలకు ఒరిగిన వరి పంటను ఆయన పరిశీలించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జీడీనెల్లూరు: సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

వర్షం.. కష్టం

విజయపురం, న్యూస్‌టుడే: మండలంలో రెండు, మూడ్రోజులుగా ఎడతెరపిలేని వర్షం కారణంగా జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించింది. 50 శాతానికి పైగా చెరువులు జలకళ సంతరించుకున్నాయి. పాతార్కాడు, ఇల్లత్తూరు పెద్ద చెరువులు మొరవ పారుతున్నాయి. మండలంలో అక్కడక్కడ పల్లపు ప్రదేశాలలోని నాటు వరి, చెరకు పంట నీటమునిగాయి. చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు పనుల కారణంగా రోడ్డు నిర్మాణం జరగడంతో వర్షపు నీరు బయటకు వెళ్లలేని పరిస్థితిలో మండలంలోని కళియంబాకం వద్ద పొలాలు చెరువును తలపిస్తున్నాయి. నీట మునిగిన పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వర్షానికి ఎంపీడీవో కార్యాలయం ఉరుస్తోంది. **నిండ్ర:** పాదిరిలో మూడు కుటుంబాలకు చెందిన పూరిపాకల గోడలు నేల కూలాయి. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు అదే పంచాయతీకి చెందిన వీఆర్వో జోనా బుధవారం బాధ్యతలు చేపట్టిన వెంటనే వెళ్లి పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకుంటామని ఆమె తెలిపారు. **జీడీ నెల్లూరు, కార్వేటినగరం:** తుపాను ప్రభావానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే థామస్ అధికారులను కోరారు. ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పెనుమూరు, పాలసముద్రం, జీడీనెల్లూరు మండలాల అధికారులతో ప్రజలు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. అంతకుమందు కార్వేటినగరంలోనూ అధికారులతో సమీక్షించారు.



వైద్యురాలితో మాట్లాడుతున్న ప్రభావతీదేవి

ప్రజలకు అవగాహన కల్పించాలి

తవణంపల్లె: కె.పట్నం ఆరోగ్య ఉపకేంద్రాన్ని డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. గ్రామానికి సమీపంలో కోళ్ల ఫారం ఉందని ఫిర్యాదు రావడంతో దాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారిణి ప్రియాంక, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

వేడుకగా గిరి ప్రదక్షిణ



పురవీధుల్లో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: గిరింపేట చెంగలరాయకొండపై వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గిరి ప్రదక్షిణ కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారి ప్రదక్షిణ కోసం భక్తులకు ఎగబట్టారు.

భర్త నుంచి ప్రాణహాని

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నా భర్త పట్టాభి నుంచి ప్రాణహాని ఉందని, నాకు, నా బిడ్డకు రక్షణ కల్పించాలని చిత్తూరు నగరం మురకంబట్టు కొత్తూరుకు చెందిన రోజా ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లె మాదిగపల్లెకు చెందిన పట్టాభితో 13 ఏళ్ల క్రితం తనకు పెళ్లైందని, అప్పటి నుంచి అతడు తనను అనుమానిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడన్నారు. ఈ ఏడాది మే నెలలో ఇంటి నుంచి గెంటేశాడని, అతడి తల్లిదండ్రులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. చెల్లి సాయంతో భర్తపై కోర్టులో విడాకుల కేసు వేశానని చెప్పారు. దీనికితోడు చిత్తూరు తాలూకా పోలీసుస్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశానన్నారు. నన్ను, నా బిడ్డను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఆమె పేర్కొన్నారు.

ఆశయం ఉన్నతం..

పరచుకున్న పచ్చదనం

మొక్కలను పెంచి, పర్యావరణాన్ని పెంపొందించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలన్న అధికారుల ఆశయం ఫలిస్తోంది. ఇందుకు తార్కాణమే బంగారుపాళ్యం మండలంలోని లక్ష్మీపురం నుంచి ఎగువ కంతలచెరువు గ్రామానికి వేళ్లే మార్గంలో రహదారి పక్కన నాటిన అల్లనేరేడు మొక్కలు. అధికారులు, గ్రామస్థుల సంరక్షణలో మొక్కలు పెరిగి పచ్చదనాన్ని పరుచుకున్నాయి. దీంతో రహదారి పక్కన ఉన్న మొక్కలు అహ్లాదకర వాతావరణంతో కళకళలాడుతున్నాయి.

బంగారుపాళ్యం: గ్రామాల్లోని కూలీలకు జీవనోపాధి కల్పించి, పంచాయతీల అభివృద్ధికి అమలు చేసిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2019-20వ ఆర్థిక సంవత్సరంలో రూ.3 లక్షలతో మండలంలోని లక్ష్మీపురం నుంచి ఎగువకంతల చెరువు రహదారి పక్కన 400కు పైగా అల్లనేరుడు మొక్కలు నాటారు. వీటి సంరక్షణకు అప్పట్లో చెట్లు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. క్రమం తప్పకుండా ట్యాంకర్లతో నీటిని అందించి ఆయా మొక్కలను రక్షించారు. చెట్ల ఎదుగుదలకు ఎరువులు వాడారు. అప్పటి ఏపీవో మురుగేషన్ మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆతర్వాత వచ్చిన కిరణ్ మొక్కల పెంపకంపై దృష్టి పెట్టారు. కాలక్రమంలో చెట్లు ఏపుగా పెరిగి పంట చేతికి వచ్చే స్థితికి చేరుకున్నాయి. గతేడాది కొన్ని చెట్ల నుంచి అల్లనేరేడు పంట వచ్చింది. ఈ ఏడాది సైతం పంట వచ్చే అవకాశం కనిపిస్తోంది. పంచాయతీ అధికారులు పంటను కాపాడి విక్రయిస్తే పంచాయతీకి ఆదాయం వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు.



లక్ష్మీపురం-ఎగువ కంతల చెరువు రహదారి పక్కన ఏపుగా పెరిగిన అల్లనేరేడు చెట్లు

కృష్ణాపురం ప్రాజెక్టు పరిశీలన

కార్వేటినగరం: కృష్ణాపురం ప్రాజెక్టును ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దారు భగవతి, సీఐ హనుమంతప్ప బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులోకి వరద భారీగా చేరుతోందని పరివాహక ప్రాంతంలో ఎవరూ సంచరించరాదని హెచ్చరించారు. ప్రాజెక్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు



ప్రాంతీయ ఆసుపత్రిలో పరిశీలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. బెడ్ షీట్లు, ఇతర సామగ్రి అవసరాలకు సంబంధించి ప్రణాళికలు ఇవ్వాలని వైద్యశాల పర్యవేక్షకులు విజయ కుమారిని ఆదేశించారు. దీంతోపాటు ఆసుపత్రిలోని మార్చురీ భవనాన్ని అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకరయ్య ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. బస్సు సర్వీసుల్లో మార్పులు, చేర్పులు, ఇతర సూచనలు ఇవ్వాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కల్లూరు, న్యూస్‌టుడే:

సమస్య: పాళెం గ్రామ సమీపంలోని విద్యుత్ నియంత్రిక చుట్టూ ముళ్లకంపలు పెరిగాయి. 11కేవీ విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వెంటనే శుభ్రం చేయించాలి. – స్థానిక రైతులు

సమాధానం: పరిశీలించి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. – పంచాయతీ కార్యదర్శి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణం ప్రధాన రహదారుల్లో మూగజీవాలు రోడ్డుపైకి వస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందిగా మారింది. – రాజా రమేష్, కుప్పం

సమాధానం: మూగజీవాలు రోడ్డుపైకి వదలకుండా యజమానులకు అవగాహన కల్పిస్తాం.

– శ్రీనివాసరావు, కుప్పం పురపాలిక కమిషనర్

మట్టి తొలగించి.. తాత్కాలిక పనులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేట మార్గం, కృష్ణగిరి రోడ్డు కూడలి, దళవాయికొత్తపల్లె సమీపంలోని రైల్వే కింది వంతెనల వద్ద పురపాలిక అధికారులు నిల్వ చేసిన మట్టి తొలగించారు. వర్షాల సమయంలో మట్టి అడ్డుపడి వంతెనల కింద నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యపై సమస్యపై 'ఈనాడు'లో ఈనెల 8న 'ప్రమాదకరంగా వంతెనలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో మరమ్మతులు చేపట్టారు. వంతెనల్లో చేరిన నీరు ఎప్పటికప్పుడు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

తాగునీటి పైపులకు మరమ్మతులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వజ్రవేలు శెట్టి వీధి, కొత్తపేట జయప్రకాష్ రోడ్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పైపులు పగిలి తాగునీరు వృథాగా కాల్వలో కలుస్తుండేది. సమస్యపై స్థానికుల ఫిర్యాదుతో 'మేమున్నాం.. మీకుతోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు.. సిబ్బందిని పంపి పైపులైన్లకు మరమ్మతులు చేయించారు. దీంతో నీటి వృథా నిలిచింది.

స్పందనకు వందనం

చెత్తకుప్ప తొలగింపు

పుంగనూరు: పట్టణంలోని కొత్తపేట- మదనపల్లె రోడ్‌లోని చెత్తకుప్పలను పురపాలక పారిశుద్ధ్య కార్మికులు బుధవారం తొలగించారు. ఈనెల 14న ఈనాడులో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన సమస్య ప్రచురితమైంది. పుర కమిషనర్ మధుసూదనరెడ్డి స్పందించి చెత్తకుప్ప తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల బాధ్యతారాహిత్యం



బైరెడ్డిపల్లె-2 సచివాలయంలో ఉద్యోగుల్లేక నిరీక్షిస్తున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగుల బాధ్యతారాహిత్యంపై జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బైరెడ్డిపల్లె-2 సచివాలయాన్ని బుధవారం 2.50 గంటలకు ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో ఖాళీ కుర్చీలు చూసి 20 నిమిషాలు అక్కడే కూర్చున్నారు. అయినా ఎవరూ రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ దృష్టికి తీసుకెళ్లారు. జడ్పీ ఛైర్మన్ తనిఖీ సమయంలో ఇద్దరు ఉద్యోగులు విధి నిర్వహణలో గ్రామాలకు వెళ్లగా, ఇద్దరు రైతు సేవా కేంద్రంలో ఉన్నట్లు ఎంపీడీవో వివరణ ఇచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పలమనేరు, న్యూస్‌టుడే: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు బీమా వర్తించేలా చేయాలని సూచించారు. ఎంపీపీ రోజా, వైస్ ఎంపీపీ జయశ్రీ, ఎంపీడీవో ఖాదర్‌బాషా హాజరయ్యారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

సదుం, న్యూస్‌టుడే: ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని స్థానికులు అడ్డుకున్న ఘటన బుధవారం బస్టాండులో చోటుచేసుకుంది. గతంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణంలోనే నిల్వలు దించేందుకు నూతన నిర్వాహకులు వచ్చారు. స్థానికులు ఇక్కడ మద్యం దుకాణం నిర్వహించరాదని చెప్పారు. సమాచారం అందుకున్న ఎస్సై షేక్షావలీ ఇరువురుకి సర్దిచెప్పి మరో ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అమృత్ అడుగులు.. మురుగు పరుగులు

◆ పెద్దచెరువు దుర్గంధానికి విముక్తి ◆ పట్టణంలో మూడు చోట్ల ఎస్టీపీలు ◆ స్థలసేకరణలో అధికారులు.. త్వరలో టెండర్లు

పలమనేరు, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన పలమనేరు పట్టణంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. వేసవిలోనూ ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతుంటాయి. అయితే పట్టణ శివారులోని పెద్దచెరువు మురుగు నిల్వలతో అధ్వానంగా మారింది. కాలనీల నుంచి ఉత్పత్తయ్యే వ్యర్థ జలాలన్నీ అందులో కలిసి నీళ్లు రంగు మారి కనిపిస్తున్నాయి. దీనికి తోడు ఆ సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు సైతం కలుషితమయ్యాయి. స్థానికులు బోర్లు వేస్తే నీరు రంగు మారి వస్తున్నాయి. కనీసం పశువులు సైతం తాగేందుకు పనికిరావడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి.



మురుగుతో నిండిన పెద్దచెరువు

కూటమి ప్రభుత్వం కృషితో కేంద్రం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకంలో పట్టణాన్ని ఎంపిక చేశారు. ముఖ్యంగా ఇక్కడ మురుగు నీటి పారుదల వ్యవస్థ, మురుగు శుద్ధికరణ చేపట్టాలని ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. పట్టణంలోని 26 వార్డుల నుంచి వచ్చే మురుగు శుద్ధి చేసేందుకు మూడు చోట్ల ఎస్టీపీలు అవసరమని తేల్చారు. వాటి కోసం రూ.14 కోట్ల నిధులు అవసరమని తేల్చారు. ఆ మొత్తం కేంద్రం ఇవ్వనుంది.

మూడు శుద్ధి కేంద్రాల మంజూరు

స్థల సేకరణకు అధికారుల కసరత్తు

తాజాగా కూటమి ప్రభుత్వం మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూసేందుకు చొరవ చూపింది. దీంతో చెరువులో మురుగు నీరు కలిసేందుకు ముందుగానే వాటిని శుద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయించారు. పురపాలిక పరిధిలో మూడు చోట్ల ఎస్టీపీలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన స్థల సేకరణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పెద్దచెరువు సమీపంలో, నీళ్లకుంట, గంటావూరు వద్ద ప్రభుత్వ భూములు సేకరించాలని తలచారు. మొత్తం 3.5 ఎకరాల భూమి అవసరమని తేల్చారు. ఎస్టీపీల సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశారు.

వైకాపా హయాంలో కాలయాపన

ఐదేళ్లు పాలించిన వైకాపా మురుగు ఇబ్బంది తొలగించేందుకు కనీసం పట్టించుకోలేదు. అంతకు మునుపు తెదేపా ప్రభుత్వ హయాంలో చెరువులో చేరుతున్న మురుగు నీటిని మళ్లించడానికి ప్రత్యేక కాలువ నిర్మాణం ప్రారంభించారు. పనులు పూర్తి కాక మునుపే ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయి. తర్వాత వైకాపా ప్రభుత్వం చెరువు సుందరీకరణ చేపడతామని హామీ ఇచ్చారు. ఐదేళ్లలో ఎటువంటి పురోగతి కనిపించలేదు. నిధుల లేమితో ఈ పథకం అటకెక్కింది.

ప్రధాన సమస్యకు పరిష్కారం

పెద్దచెరువులో చేరుతున్న మురుగునీటిని శుద్ధి చేసి ప్రజావసరాల కోసం వినియోగిస్తే సమస్య తీరుతుంది. దీని కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి.. వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసిన తర్వాతనే చెరువులోకి వదిలేలా ప్రణాళిక రూపొందించాం. పనులు ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి.

– ఎన్వీరమణారెడ్డి, పుర కమిషనర్, పలమనేరు



చౌడేపల్లె: శెట్టిపేటలో దెబ్బతిన్న టమాటా



పెద్దపంజాణి: పెద్దవ్యాపల్లెలో పూలతోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి



కుప్పం గ్రామీణ: బురదమయంగా దెయ్యాలవంక రహదారి

రోజంతా వర్షం.. పంటలకు నష్టం

న్యూస్‌టుడే, బృందం: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. పలు చోట్ల పంటలకు నష్టం జరిగింది. చౌడేపల్లె మండలంలో టమాటా, వరి, కాలీఫ్లవర్, బీన్స్, కాకర పంటలు నీట మునిగాయి. చౌడేపల్లె బజారు వీధిలోని ఓ నీటి తొట్టెలో ఎద్దు ప్రమాదవశాత్తు పడింది. స్థానికులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. సోమల మండలంలో పూలు, టమాటా, కాలీఫ్లవర్, వంగ పంటలకు నష్టం జరిగింది. ఉద్యానవనశాఖ అధికారి సంతోషికుమారి పరిశీలించారు. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు తహసీల్దార్ రాము ఆదేశించారు. వీఆర్వోలతో కార్యాలయంలో సమీక్షించారు. బైరెడ్డిపల్లె మండలంలో పలు చోట్ల రహదారులు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుప్పం మండల పరిధి నూలుకుంట నుంచి దెయ్యాలవంక గ్రామానికి వెళ్లే మార్గంలో వర్షానికి బురదమయంగా మారి రాకపోకలు సాగించేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు. బైరెడ్డిపల్లె మండలం లక్ష్మనపల్లె-రామాపురం క్రాస్ రోడ్డు గుంతలమయమై దుస్థితికి చేరింది. ఈ మార్గంలో లక్ష్మనపల్లె, గొల్లచీమనపల్లె, మిట్టపల్లె, నాచకుప్పం, మూగనపల్లె వద్ద పరిస్థితి దారుణంగా ఉంది.



చౌడేపల్లెలో నీటి గుంటలో పడిన ఎద్దును బయటకు తీస్తున్న స్థానికులు



చౌడేపల్లె: మిట్టూరు వద్ద కాలీఫ్లవర్ పంటలోకి చేరిన నీరు



బైరెడ్డిపల్లె: గుంతలు పడ్డి దుస్థితికి చేరిన లక్ష్మనపల్లె-రామాపురం క్రాస్ రోడ్డు



పుంగనూరు: వీఆర్వోలతో సమీక్షిస్తున్న తహసీల్దారు రాము

గంకొండ.. మేఘం నిండ..!



పెద్దపంజాణి, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. సాయంత్రం కొంతసేపు నిలిచింది. కొంతసేపటికే మబ్బులు కమ్ముకున్నాయి. పలమనేరు-చౌడేపల్లె మార్గంలో గంకొండను మేఘాలు తాకాయి. ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్ మనిపించింది.



డ్రైవర్లకు ప్రోత్సాహక నగదు బహుమతి అందిస్తున్న డీఎం సుధాకరయ్య

ఇంధనాన్ని పొదుపు చేయాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ సంస్థ అభివృద్ధి చెందడానికి హెచ్ఎస్‌డీ ఆయిల్ పొదుపు చేయాలని, కండక్టర్లు ఐకేఆర్ సాధించాలని ఆర్టీసీ డీఎం సుధాకరయ్య కోరారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ప్రతిభ చాటిన డ్రైవర్లు, కండక్టర్లు రామనాథ, పైడిబాబా, శేషాద్రి, పార్థసారథులకు నగదు ప్రోత్సాహకం అందించారు. ఆర్టీసీలోనే ప్రయాణించేలా ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. అధికారి సంధ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



తిరువణ్ణామలైకి ఆర్టీసీ బస్సులు

పుంగనూరు, న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరువణ్ణామలైకి డిపో నుంచి బుధవారం ఆరు బస్సులు బయల్దేరాయి. వారం రోజులుగా సేరుకు, ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు తరలి వచ్చారు. పౌర్ణమి రోజున అరుణాచలేశ్వర స్వామి కొండ చుట్టూ ప్రదక్షిణ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు తరలివెళ్లారు. భక్తులకు డీఎం దాత రామన భోజనం, తాగునీరు అందించారు.

రక్షిత మంచినీటి పంపిణీకి ప్రాధాన్యం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రక్షిత మంచినీటి వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన రెండో రోజు శిక్షణలో ప్రసంగించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రజాప్రతినిధులు జవాబుదారులుగా ఉండాలన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. విషయ పరిజ్ఞానులు శ్రీనివాసులురెడ్డి, బసవరాజులు మండలాభివృద్ధిపై పలు విషయాలు వివరించారు.

పాలనపై అవగాహన అవసరం

సదుం, న్యూస్‌టుడే: స్థానిక పాలనపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు అవగాహన అవసరమని ఈవోపీఆర్డీ వరప్రసాద్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో రెండో రోజు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం చేయడం తప్పనిసరి అన్నారు.

నిబంధనలు పాటించాలి

సదుం, న్యూస్‌టుడే: బస్టాండులో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై షేక్షావలీ వాహనదారులకు సూచించారు. ఎక్కడపడితే అక్కడ బైకులు, కార్లు పార్కింగ్ చేయరాదన్నారు. వాహన తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ వినియోగించాలని చెప్పారు.

ఏనుగుల దాడిలో పంటలకు నష్టం

కల్లూరు: మండల పరిధి మతుకువారిపల్లె పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన రైతు ఎర్రయ్య సాగుచేసిన అర ఎకరా టమాటా, అర ఎకరా వరి పంటను ఏనుగుల గుంపు గురువారం తెల్లవారుజామున తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల దాడిలో నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రశాంతంగా మత్స్య సహకార సంఘం ఎన్నిక



ఎర్రయ్య

కల్లూరు: పులిచెర్ల మండల పరిధిలోని శ్రీవెంకటేశ్వర మత్స్య సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా దేవళంపేట పంచాయతీ చెన్నబెస్తపల్లెకు ఎర్రయ్య ఎన్నికయ్యారు. బుధవారం నూతన పాలకవర్గ ఎన్నికలు.. ఎన్నికల అధికారి రవికుమార్, సహాయ సంచాలకులు రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఉపాధ్యక్షుడిగా మునేంద్ర, కార్యదర్శిగా జయకుమార్, డైరెక్టర్లుగా హేమద్రి, కాంతరాజు, ఎర్రయ్య, లింగమూర్తి, మల్లికార్జున, నాగేంద్ర ఎన్నికయ్యారు.

పీహెచ్‌సీల్లో కాన్పులు పెంచాలి

శాంతిపురం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్య పెంచాలని అదనపు డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రోగులతో పాటు బాలింతలను అడిగి అందుతున్న వైద్య సేవలు పరిశీలించారు. కాన్పులు చేసుకున్న వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్థిక సాయాన్ని సత్వరం అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యులు వంశీకృష్ణ, ప్రసాద్, సిబ్బంది లతీఫ్‌ఖాన్, కోదండపాణి పాల్గొన్నారు.



కాన్పుల వార్డులో వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి

'కూటమి పాలనలో మౌలిక వసతులకు ప్రాధాన్యం'

శాంతిపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో సామాజిక సమస్యల పరిష్కారంలో భాగంగా.. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధి సోస్తేగానిపల్లె, కొలమడుగు, దండికుప్పం, శివరామపురం, అబకలదొడ్డి పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రూ. 2.32 కోట్ల పనులకు భూమి పూజలు చేశారు. విశ్వనాథనాయుడు, జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ కుమార్, సర్పంచి పుష్ప, ఏపీఓ హరినాథ్ పాల్గొన్నారు.



శాంతిపురం: కొలమడుగు పల్లె పండగ సభలో శ్రీకాంత్, మునిరత్నం, శ్రీనివాసులు

నాణ్యతలో రాజీ వద్దు

సోమల: సీసీ రోడ్ల నిర్మాణాన్ని నాణ్యతగా చేయాలని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. మండలంలోని అడుసుపల్లె, ముంద్రివారిపల్లె, నంజంపేట సరస్వతీపురం, ఎస్. నడింపల్లె, పొదలకుంటపల్లెలో ఏపీవో దినకర్‌బాబుతో కలసి ప్రారంభించారు. **రామకుప్పం:** నారాయణపురం తండా సర్పంచి రాజేశ్వరి ఆధ్వర్యంలో గోకులం షెడ్ల ప్రారంభానికి భూమి పూజ చేశారు. **బైరెడ్డిపల్లె:** పాతూరు నత్తం, బైరెడ్డిపల్లె పంచాయతీల్లోని గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి అధికారులు, కూటమి నాయకులు భూమిపూజ చేపట్టారు. మద్రిమాను చేనులో తెదేపా నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు భువనచంద్రగౌడు ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ఆటో బోల్తా.. వృద్ధురాలి మృతి

గుత్తార్లపల్లె(గుడుపల్లె), న్యూస్‌టుడే: అదుపుతప్పి ఆటో బోల్తాపడిన ఘటనలో సరోజమ్మ (72) మృతి చెందింది. ఈ ఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని గుత్తార్లపల్లె శివారులోని ఓ మలుపు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటకకు చెందిన కామసముద్రం మండలం తొపనపల్లె గ్రామానికి చెందిన సరోజమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యపరీక్షలు, చికిత్స నిమిత్తం బంధువులు ఆమెను కుప్పంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి ఆటోలో తీసుకువస్తుండగా ప్రమాదం జరిగింది. ఆమె ప్రమాదంలో గాయపడి.. కొంత సేపటికే మృతి చెందింది. బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధి తుమ్మిశి రోడ్డుకు సమీపంలో జాతీయ రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకొంది. తవణంపల్లె మండలం అరగొండకు చెందిన ఓ కుటుంబం కారులో కుప్పం వెళుతుండగా.. ఎదురుగా వి.కోట వైపు వెళుతున్న కారు అదుపుతప్పి ఢీకొన్నాయి. వాహనాలు దెబ్బతిన్నాయి. అరగొండకు చెందిన మురళి, రాజేశ్వరి, భగవంత్ తోపాటు మరో వ్యక్తి గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు కుప్పం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని రాళ్లబూదుగూరు పోలీసులు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు.. కుప్పం గ్రామీణ: మల్లానూరు సమీప మామిడితోటలో జూదమాడుతున్న ఐదుగురిని బుధవారం కుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదుచేసి వారి నుంచి రూ.1090 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆహార దినోత్సవం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలోని ప్రసూతి విభాగంలో బుధవారం అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎస్ఎన్ఏ విద్యార్థులు ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఉంచి.. బాలింతలు, గర్భిణులు, తల్లులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. చిత్తూరు అపోలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రంగనాథ్, అధికారులు రామ్‌గోపాల్, మంజులత, శేషసాయి, సరళ, శోభారాణి, చిత్ర, రాణి పాల్గొన్నారు.

అర్హులైన వైద్యులతోనే చికిత్స

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రైవేటు క్లినిక్‌ల్లో అర్హులైన వైద్యులతోనే చికిత్స చేయించాలని డీఐవో హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన కాకాతోపు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రి ఆరోగ్య క్లినిక్‌ను కూడా పరిశీలించారు. క్లినిక్ నిర్వహించేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఆయన తనిఖీ చేసే సమయంలో క్లినిక్‌లో ఎవరూ వైద్యులు లేరు. ఎద్దులసంత సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యులు నిరంజన్, ఆశ, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.



టీకా పంపిణీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న హనుమంతరావు


చెట్లు కూలేదాకా పట్టించుకోరా..?



ఎండిన చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. మండల పరిధిలోని పలమనేరు- చౌడేపల్లె ప్రధానమార్గంలో కోగిలేరు మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు సమీపంలో ఎండిన చెట్లు ఉన్నాయి. అవి ఎప్పుడు కూలుతాయోనని వాహన చోదకులు భయాందోళనలు చెందుతున్నారు. మూడు రోజులుగా వర్షం, ఈదురుగాలులు ఉండటంతో కొమ్మలు విరిగి పడ్డాయని.. ఓ ద్విచక్రవాహనదారుడు త్రుటిలో తప్పించుకున్నారని తెలిపారు. వాటిని తొలగించడంలో ఆర్అండ్‌బీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రస్తుతం పెనుగాలులు వీచి ఏవైనా వాహనాలు వెళ్లేటప్పుడు కూలిపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు.

- న్యూస్‌టుడే, పెద్దపంజాణి

నిబంధనలున్నా.. పట్టవు మాకు



ఒక వైపు రోడ్డు భద్రతా నిబంధనలు ఉన్నప్పటికీ.. తమకేమీ పట్టనట్లు ద్విచక్ర వాహనచోదకులు వ్యవహరిస్తున్నారు. కుప్పంలో ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ద్విచక్ర వాహనాల్లో ఇద్దరి కంటే అధికంగా ప్రయాణిస్తూ పలు ఎదురుగా వచ్చే వారికి భయపెట్టేలా వాహనాలను నడుపుతున్నారు. ఇద్దరికన్నా అధికంగా ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నా, వాహనచోదకుల్లో మార్పు రావడం లేదు. **- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం**